# కోడిపుంజు

**—గొంటు శ్రీనివాస్**

**మ**నవడికి పాఠం చెబుతున్నానన్న మాటే గానీ నా మనసంతా పెరట్లో తిరుగాడుతున్న నల్లమచ్చల కోడిపుంజు చుట్టే పరిభ్రమిస్తోంది. పొరుగింటి వాళ్ళ కోడి అది. బాగా కొవ్వుపట్టి కెక్కరిస్తున్న ఆ పుంజుని చూడగానే కోడిమాంసం తినాలన్న కోరిక నాలిక పీకేస్తోంది.

ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైర్మెంటు పుచ్చుకుని రెండేళ్ళు గడిచాపోయాయి. కాటికి కాళ్ళు జాపేశాననే చెప్పాలి. ఈ తుది రోజుల్లో గర్భిణీ లాగా అవీ ఇవీ తినాలన్న కోరికలు కలగడం నా మటుకు నాకే విచిత్రంగా వుంది.

చనిపోయిన నా భార్య గుర్తుకొచ్చింది ఒక్క క్షణం. ఏనాడూ నేను నోరు తెరిచి అడగకముందే కావల్సింది అమర్చి పెట్టేది. టైఫాయిడ్ జ్వరంతో సరైన చికిత్స లభించక చనిపోయింది. కేవలం నా అసమర్థత వల్లే.

కూతుళ్ళందర్నీ అత్తవారిళ్ళకి పంపించేశాను. నేను కొడుకు దగ్గర వుంటున్నాను. వాడు! పాపం నేనంటే ప్రాణం ఇచ్చేవాడు ఒకప్పుడు!.

కాని కోడలొచ్చాక అంతా తారుమారైపోయింది. నేనంటే ఆమెకు లోలోపల ద్వేషం... సహజమే కదా! ముసిలాణ్ణి.. రోగిష్టివాణ్ణి... మూడు పూటలా తినడం తప్పించి మరే పనీ చేత కాని వాణ్ణి... వాళ్ళ 'స్వీట్‌హోం' కి నప్పని పాత సామానుని.

నా ఆలోచనల్లో నేనుండగా,

"హు! వెధవ కోడి! పనీ పాటా లేక కొవ్వెక్కి కొట్టుకుంటోంది. దీని గొటారింపుతో చెవులు చిల్లులు పడిపోతున్నాయ్!" అంటూ మా కోడలు బలం కొద్దీ మట్టిపెడ్డ విసిరింది దాని మీదికి. అది బదకంగా రెక్కలు రెపరెపలాడించింది ప్రహరీ గోడ మీదికెగిరి. మావైపోసారి గర్వంగా చూసి, వాళ్ళ పెరట్లోకి దూకేసింది.

ముక్కు మీదికి జారిపోతున్న కళ్ళజోడు సర్దుకున్నాను—

"పనీపాటా లేకపపోవడం... కొవ్వెక్కి కొట్టుకోవడం.. ఈ తిట్లన్నీ అన్యాపదేశంగా నన్నుద్దేశించినవేనని గ్రహించలేనంత వెర్రి వెధవను కాను. అయినా— కుక్కల మీదా, కోళ్ళ మీదా పెట్టి పరోక్షంగా తిట్టే ఈ మహత్తరమైన కళలో ఆడవాళ్ళు మహా నిష్ణాతులు".

"భోజనం వడ్డించాను!" లోప.ల్నించి కోడలి పిలుపుతో నా ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పడింది.

పాఠం చాలించి లేచాను.

కాళ్ళు కడుక్కుని వచ్చి పీటమీద కూర్చున్నాను. భోజనాన్ని చూడగానే మళ్ళీ తొలుస్తున్నాయి ఆలోచనలు. తెలిసిపోతూనే వుంది. ఆదో రకమైన వాసన. రాత్రి కాచిన చారు, పులిసిన మజ్జిగ, మెత్తబడ్డ బంగాళాదుంపల వేపుడు.. చెప్పరానంత కోపం వచ్చింది. గట్టిగా నిలదీసి అడగాలనుకున్నాను. కాని విచక్షణ నన్ను నిలవరించింది. పరాయి ఇంటి నుంచి వచ్చిన ఆడపిల్ల మంచిదైనా, చెడ్డదైనా నోరు పారేసుకోవడం సంస్కారం కాదు.

ఈవిడ సంగతి నా కొడుకుతో చెబుతాను. ఆమె విషయం వాడే చూసుకుంటాడులే! అనుకోవడంతో మనసు కుదుటపడింది.

** ** ** రాత్రి ఎనిమిది గంటలు కాగానే భోజనం ముగించి పక్కమీద వాలాను. అబ్బాయి ఇంకా రాలేదు. ఈ మధ్య వాడు ఇల్లు చేరేసరికి పది దాటుతోంది— ఎందుకో మరి!

"పొద్దుటే వాడు బావి దగ్గర స్నానం చేస్తున్నప్పుడు కలిసి కోడలు నన్ను ఎంత హీనంగా చూస్తుందో చెప్పాలి!' 'అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

** ** ** హటాత్తుగా మెలకువ వచ్చింది. లేచి కూర్చున్నాను.

లఘుశంక...

గోడ ఆసరా చేసుకుని చీకట్లో తడుముకుంటూ నడుస్తుంటే - వంటగదిలోనించి మాటలు వినబడ్డాయి.

కొడుకూ కోడలూ భోజనం చేస్తూ చెప్పుకుంటున్న మాటలు సభ్యత కాదని తెలిసినా చెవులు రిక్కించక తప్పలేదు.

"ఏమండీ ఇలా రాత్రి పదింటిదాకా ఫ్యాక్టరీలో పని చేస్తూ వుంటే మీ ఆరోగ్యం ఏమైపోతుంది!"

"ఏం చేయను చెప్పు మరి! నాన్న మందులకే ఆరొందలు ఖర్చయిపోతున్నాయి.. నాకొచ్చే కొద్ది జీతంతో అన్ని అవసరాలు ఎలా తీరతాయి చెప్పు? తప్పతుందా మరి!"

కొద్ది క్షణాలు మౌనం—

"అది సరే! నాన్న ఎలా వున్నాడు! కలిసి పలకరించే టైం కూడా లేకపోతోంది!"

**వణుకుతున్న కంఠంతో చెప్పింది కోడలు—"**



**మామగారి పరిస్థితి బాగాలేదండీ! ఈ మధ్య** మాట కూడా తగ్గినట్టుంది. దగ్గు కూడా బాగా వస్తోంది. పాపిష్టిదాన్ని. కన్నకూతురిలా ఆదరించిన మామగారికి ఆఖరి దశలో మంచి భోజనం కూడా పెట్టలేకపోతున్నాను!"

అబ్బాయి మౌనంగా భోజనం ముగించి చేతులు కడుక్కుని లేచి నిలబడ్డాడు.

"ఏమండీ!" పిలిచింది కోడలు.

"ఏమిటి?"

'కోడి మాంసం తినాలనుందని మామగారు అడిగారు!" కాసేపు మౌనంగా వుండిపోయాడు వాడు.

"నీ దగ్గర డబ్బేమైనా వుందా?' అడిగాడు నెమ్మదిగా .. కోడలు లేదన్నట్టు చెప్పింది.

"సరే! బైట కొంటే డబ్బు ఎక్కువ అవుతుంది. పొరుగింటి వాళ్ళ దగ్గర మంచి కోడి బేరం చేయి. రేపెక్కడన్నా డబ్బు అప్పు తెస్తాను!"

ఇక వినాలనిపించలేదు నాకు.

నీరసంగా మంచం మీద వాలిపోయాను.

ఖరీదైన నా రోగాన్ని బాగు చేయడం కోసం ఓవర్‌టైం వర్క్ చేసి ఆరోగ్యం చెడగొట్టుకుంటున్న నా కొడుకు...

నా మందుల డబ్బు కోసం , నా పళ్ళరసాల కోసం.. తాను ఉత్త మజ్జిగ మెతుకులు తింటున్న నా కోడలు.. .

మంచి స్కూల్లో చేరలేక సర్కారు బళ్ళో చదువుకుంటున్న మనుమడు...

నామనసులో బొమ్మల్లా పరిభ్రమిస్తున్నారు.

చావుకి సరిహద్దుల్లో వున్న నన్ను బ్రతికించుకోవడానికి వాళ్ళు పడుతున్న తపనని, కష్టాలను, ఆవేదనను, అసహాయతను ఇన్నాళ్ళూ ఎంతగా అపార్థం చేసుకున్నాను నేను?

ప్రపంచాన్ని మనం ఏ కోణం నుంచి చూస్తామో, అదే కోణంలో అది మనకు కనపడుతుంది.

అప్పుడు నాకు ఓ విషయం గుర్తుకొచ్చింది

చావు దగ్గర పడుతున్నా నాలో ఇంకా 'మాట్లాడగలిగే' శక్తి మిగిలే వుంది. పాఠాలు చెప్పే జ్ఞానం, జ్ఞాపకశక్తి అలాగే వుంది.

మరి వాళ్ళకోసం నేనేమీ చేయలేనా?

మర్నాడు రాత్రి—

"నాన్నా! పిల్లల్ని ట్యూషన్‌కి పంపించండని వీధిలో అందరినీ అడిగావట! ఈ వయసులో నీకంత కష్టం ఏమి వచ్చింది? అంత అవసరం ఏమొచ్చింది? "కోపంగా అడిగాడు అబ్బాయి.

మనస్ఫూర్తిగా నవ్వాను.

"ఖాళీగా వుంటే ఏమీ తోచక పిచ్చెక్కినట్టుగా వుందిరా! పిల్లల్తో కాస్త కాలక్షేపంగా వుంటుందని.. అంతే!!"

ఇప్పుడు నాకు తృప్తిగా వుంది. ●